క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఒంగోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్


భోజనాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమార్

కొండపి (మర్రిపూడి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు రోజూ నాణ్యమైన భోజనం అందించాలని ఒంగోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక బాలికల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, ఎంపీడీఓ నాగమణి, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

వెలిగండ్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కెనరా బ్యాంక్ మేనేజర్ తాతపూడి ప్రిన్సి అన్నారు. వెలిగండ్ల ప్రాథమిక పాఠశాల(సీపీ)లో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ప్రిన్సి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాలలో ఒక్కొక్క చెట్టు నాటాలన్నారు. మొక్కలను పెంచితే అవి మనకు ప్రాణవాయువును అందిస్తాయన్నారు. ఎంఈఓ దాసుప్రసాద్, హెచ్‌ఎం చల్లా సత్యనారాయణ, అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కొండపి(టంగుటూరు): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని పెట్లూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూష పేర్కొన్నారు. కొండపిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని వైద్య సిబ్బందితో కలిసి సోమవారం ఆమె సందర్శించారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 16 మంది పిల్లలను గుర్తించి మందులు అందించారు. ప్రిన్సిపాల్ అరుణ, వైద్య సిబ్బంది రవిబాబు, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

హనుమంతునిపాడు: మండలంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కె.లలిత తెలిపారు. మంగళవారం, బుధవారం సీతారాంపురం సచివాలయంలో, గురు, శుక్రవారాలు నందనవనం సచివాలయంలో, శనివారం తిమ్మారెడ్డిపల్లి సచివాయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో కొత్త ఆధార్‌కార్డులు, చిరునామా మార్పు, తప్పు ఒప్పుల సవర్ణలు, పుట్టినతేదీ సవర్ణలు చేస్తామన్నారు. ప్రత్యేక ఆధార్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీర్ల గుండంలో పడి యువకునికి గాయాలు

సీఎస్‌పురం(పామూరు): పీర్ల గుండంలో ప్రమాదవశాత్తు పడి యువకునికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలోని ఏకునాంపురంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఏకునాంపురం గ్రామంలో పీర్ల పండుగ ఉత్సవాల్లో భాగంగా సోమవారం పీర్లనెత్తుకుని గుండంలో నడిచే వేడుక జరిగింది. ఈసందర్భంగా గ్రామానికి చెందిన వేల్పుల బలరామయ్య అనే యువకుడు పీర్లను ఎత్తుకుని గుండంలో నడుస్తుండగా ప్రమాదవశాత్తు గుండంలో పడిపోయాడు. దీంతో బలరామయ్యకు రెండు కాళ్లు, చేతులు, మోకాళ్లు కాలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని సీఎస్‌పురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా డాక్టర్ మహేష్ చికిత్స అందించారు. క్షతగాత్రుని ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన అవసరం లేదని డాక్టర్ తెలిపారు.

హెల్మెట్ విధిగా ధరించాలి


అవగాహన చేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ అన్నారు. సీఎస్‌పురంలో సోమవారం సాయంత్రం మండల న్యాయ సేవాధికార సంస్థ, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకం వల్ల ప్రయోజనాలు, వాడకపోతే నష్టాలపై వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రమాదాల్లో యజమాని మృత్యువాతపడితే కుటుంబం మొత్తం కష్టాలపాలవుతుందని గ్రహించాలన్నారు. స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్ నాయబ్‌రసూల్, మానవహక్కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి..
ఆశలు ఫలించాలి!


పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన పాకల బీచ్


సీహెచ్‌సీగా మార్చాల్సిన సింగరాయకొండ ప్రభుత్వ ఆస్పత్రి

● కొండపి నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలి
● ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి పరిష్కరించాలని ప్రజల ఆశలు
● సార్వత్రిక ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వినతి

సింగరాయకొండ: నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తానని, తాగునీరు, సాగునీటి సమస్య తీరుస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చిన డోలా బాల వీరాంజనేయస్వామి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి పరిష్కరించాలని ప్రజల ఆశగా ఎదురు చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని, పాలేరు, మన్నేరు, ముసి పై చెక్‌డ్యాంలు నిర్మిస్తానని, సింగరాయకొండ మండలంలోని సుమారు 10 వేల ఎకరాలకు ప్రధాన సాగునీటి వనరైన పాలేరు–బిట్రగుంట స్కీము సప్లయ్ ఛానల్ అభివృద్ధికి కృషి చేస్తానని డోలా హామీ ఇచ్చారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాలను ప్రస్తావించి నిధుల విడుదలపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆపిన నిధులిస్తారా?

గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, మత్స్యకార భరోసా, ఈబీసీ నేస్తం తదితర పథకాలపై అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గంలో తల్లికి వందనం పథకానికి 29,360 మంది లబ్ధిదారులు, రైతు భరోసా పథకానికి 41,323 మంది, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి 19,949 మంది, వసతి దీవెన పథకానికి 15,960 మంది, మత్స్యకార భరోసా పథకానికి 2,467 మంది, ఈబీసీ నేస్తం కింద 6,721 మంది లబ్ధిదారులు తమ ఖాతాల్లో ఎప్పుడు జమ అవుతాయా అని ఎదురు చూస్తున్నారు. తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న ప్రతి పిల్లవానికి 15 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన నేపథ్యంలో భారీ సంఖ్యలో లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఫీజుల భారాన్ని కట్టడి చేయాలి

గత ప్రభుత్వంలో జగనన్న విద్యాదీవెన కింద కాలేజీ ఫీజులు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండగా ఈసారి ప్రభుత్వం నేరుగా కాలేజీలకు ఇస్తామని ప్రకటించింది. కానీ కాలేజీల్లో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి ఫీజులు వసూలు చేయకుండా యాజమాన్యాలను కట్టడి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైద్య సేవలపై దృష్టి సారించాలి

గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని ఆస్పత్రులు అభివృద్ధి చెందాయి. కొండపి సీహెచ్‌సీ, కామేపల్లి పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మించారు. కొండపి సీహెచ్‌సీలో అధునాతన స్కానింగ్ యంత్రాలు మంజూరు చేసినప్పటికీ నేటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. సింగరాయకొండ పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి గత ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిపై సాధ్యాసాధ్యాలను కూడా జిల్లా స్థాయి అధికారిని నియమించగా అప్‌గ్రేడ్ చేయడానికి అన్ని రకాల వసతులు, స్థలం ఉన్నాయని అదనంగా ఒకటీరెండు భవనాలు నిర్మిస్తే సరిపోతుందని నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిని సీహెచ్‌సీగా మార్చేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలు ఎప్పుడు?

టీడీపీ కూటమి ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్క పింఛను పథకం మాత్రమే అమలు చేశారని, మిగిలిన ఐదు పథకాలను త్వరగా అందించాలని ప్రజలు కోరుతున్నారు. రైతు భరోసా, మత్స్యకార భరోసా పథకాలు ఎప్పుడు అమలు ఇస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కనిగిరిపై కనికరం చూపండి..!

● కనిగిరి ప్రజలను పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్య
● నిమ్జ్, ట్రిపుల్ ఐటీపై దృష్టి సారించాలి
● రూ. 130కోట్ల సమగ్ర రక్షిత పథకం కొనసాగించాలి
● రూ 400 కోట్ల వాటర్ గ్రిడ్ స్కీం కొనసాగించాలి

కనిగిరి రూరల్: కనిగిరి అనగానే గుర్తుకు వచ్చే కరువు. ఇక్కడ శాశ్వత సాగు, తాగునీటి వనరులు లేవు. ప్రజలు నేటికి ఫ్లోరైడ్ నీటిని అనేక గ్రామాల్లో తాగుతున్న దుస్థితి. ఉపాధి అవకాశాలు కరువై అనేక మంది వలస జీవులుగా ఉన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోకి వెళ్లినా.. కనిగిరి వాసులు కన్పిస్తారు అంటే అతిశయోక్తి కాదు. కనిగిరి వాసులకు నిమ్జ్, ట్రిపుల్ ఐటీ, వెలిగొండ జలాలు, రక్షిత సాగు నీటి పథకం, రైల్వేలైన్ కదలకున్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి.. సమస్యల సాధనకు కృషి చేస్తారని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సురక్షిత నీరు ఏఐఐబీ స్కీంతోనే సాధ్యం:



కనిగిరి మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో దాదాపు 55 వేలకు పైగా జనాభా ఉన్నారు. కనిగిరి అనగానే గుర్తుకు వచ్చేది ఫ్లోరైడ్ సమస్య. ఇక్కడ నీటిలో ఫ్లోరోసిస్ శాతం అత్యధికంగా ఉంది. టౌణంలోని కాశిరెడ్డి కాలనీ, బొగ్గుల గొంది కాలనీ, శివారు ప్రాంతాల్లో, దిరిశవంచలోని పలు గ్రామాల్లో ఫ్లోరోసిస్ శాతం 7 పీపీఎం వరకు ఉంటుందని అధికారులే వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు కాళ్లు చేతులు వంకర, గార పళ్లు, కిడ్నీ వ్యాధి సమస్యలతో కునారిల్లుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ 130 కోట్ల ఏఐఐబీ స్కీం కింద(కనిగిరి సమగ్ర రక్షిత మంచి నీటి పథకం)ను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కాశిరెడ్డి కాలనీ వద్ద పెద్ద ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మించారు. పలు కాలనీల్లో పైప్‌లైన్ వేశారు. ఆ స్కీంను కొత్త ప్రభుత్వం కొనసాగించి పూర్తి చేసి పట్టణ ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సిన బాధ్యత ఉంది.

పెరుగుతున్న డయాలసిస్ బాధితులు

ఫ్లోరైడ్ నీటి సమస్యతో కనిగిరి ప్రాంతంలో కిడ్నీ, డయాలసిస్ బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నారు. సురక్షిత నీరు లేక పోవడంతో అనేక మంది కిడ్నీలు ఫెయిల్ అయ్యి డయాలసిస్ కేంద్రంలో చేరుతున్నారు. ప్రసుత్తం ఉన్న నివేదికల ప్రకారం కనిగిరి, పీసీపల్లి, సీఎస్ పురం, వెలిగండ్ల మండలాల్లో సుమారు 125 మంది డయాసిస్ పేషంట్లు ఉన్నారు. వీరికి రోజు 4 నాల్గు షిఫ్టులలో డయాలసిస్ చేస్తారు. నెఫ్రాలజీ వైద్యుడు రెగ్యులర్ లేరు. రెండు వారాలకు ఒకసారి వస్తారు. దీంతో ఎంబీబీఎస్ వైద్యుల పర్యవేక్షణలో డయాలసిస్ ప్రక్రియ జరుగుతుంది. ప్రస్తుతం 17 మిషన్లు మాత్రమే ఉన్నాయి. సుమారు 30 మంది డయాలసిస్ పేషంట్లకు కొత్త పింఛన్లు మంజూరు కాగా, రవాణా ఖర్చులు కూడా లేక అవస్థలు పడుతున్నారు. తగినన్ని మిషన్లు లేక పోవడంతో పీసీపల్లి, పామూరుకు చెందిన వారు డయాలసిస్ చేయించుకునేందుకు నెల్లూరు ఆస్పత్రికి వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి. పాత ఆస్పత్రి భవనంలో డయాలసిస్ కేంద్రం ఉంటడంతో పెచ్చులూడి ఇబ్బందులు పడుతున్నారు.

➤ కనిగిరి పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుంది.

➤ అండర్ డ్రైనేజీ ప్రతిపాదన గత 15 ఏళ్లుగా మరుగున పడి ఉంది. గత కాంగ్రెస్, టీడీపీ పాలనలో రూ. 3 కోట్లతో అండర్ డ్రైనేజీ ప్రతిపాదించారు. కాని ఫైలు కదల్లేదు.

వాటర్ గ్రిడ్ స్కీంతో కనిగిరి ప్రజలకు సురక్షిత జలాలు:

గత ప్రభుత్వంలో కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 442 గ్రామాల ప్రజలకు సురక్షిత జలాలు అందించేందు వాటర్ గ్రిడ్ స్కీంను రూపొందించారు. జేజేఎం(జలజీవన్ మిషన్) కింద పనులు చేపట్టేందుకు టెండర్లు పూర్తి చేశారు. సర్వే ప్రక్రియ ముగిసింది. అయితే ఈ స్కీంను కొనసాగిస్తే నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామీణ వాసులకు సురక్షిత జలాలు వస్తాయి. సుమారు 30 ఏళ్ల ముందస్తు జనాభాకనుగుణంగా ఈ పథకంను గత ప్రభుత్వంలో అధికారులు రూపొందించారు. ఈ స్కీం అమలు జరిగే కనిగిరి ప్రజలకు ఫ్లోరైడ్ సమస్య విరుగుడు అవుతుంది. వెలిగొండ ప్రాజెక్టు పరిధిలో పీసీపల్లి మండలాన్ని చేర్చాల్సి ఉంది.

నిమ్జ్, ట్రిపుల్ ఐటీపై దృష్టి:

కనిగిరికి గత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిమ్జ్(నేషనల్ కారిడార్) మంజూరైంది. కానీ కదలిక లేదు. ఆతర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో నిమ్జ్ నిర్మిత స్థలం పామూరు మండలంలో భూసేకరణ, మ్యాపింగ్ తదితర ప్రక్రియలు జరిగి ముందడుగు పడింది. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి పెట్టి కొనసాగిస్తే సుమారు 3 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు జరుగుతాయి. ట్రిపుల్ ఐటీ కళాశాల కనిగిరి ప్రజలకు కలగానే మారింది. ప్రస్తుతం కనిగిరికి వచ్చిన ట్రిపుల్ ఐటీ కాలేజీ వసతుల లేమితో ఒంగోలులో జరుగుతుంది. వచ్చే విద్యా సంవత్సరానికైనా కనిగిరిలో ప్రారంభమైతే ఈ ప్రాంతంలో పేద విద్యార్థుల్లో విద్యాభివృద్ధి పెరుగుతుంది.

➤ నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

➤ కనిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల సమస్య వేధిస్తోంది. సరిపడ వైద్యులు లేక పోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అల్లాడుతున్నారు. ప్రసవ కేసులు, ప్రమాద కేసులను ఒంగోలుకు రిఫర్ చేస్తున్నారు. చాలా ఏళ్లుగా మత్తు వైద్యుడు లేరు. ఏడాది క్రితం ఒక వైద్యురాలు రావడంతో చిన్న చిన్న అపరేషన్లు జరుగుతున్నాయి.

ఎన్నో ఆశలు

కందుకూరు: అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు హామీలను నెరవేర్చే విధంగా పనిచేయాలనే డిమాండ్‌లు వస్తున్నాయి. ప్రధానంగా నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

☛ నియోజకవర్గానికి జీవనాడైన రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధి హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. ప్రాజెక్టు అభివృద్ధి చేయడంతో పాటు, అధ్వాన్నంగా కాల్వలను మరమ్మతులు చేయడం, ఎడమకాల్వ పొడగింపు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే సోమశిల ప్రాజెక్టు నుంచి రావాల్సిన 1.5టీఎంసీల నీటిని తీసుకురావడంతో పాటు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి రాళ్లపాడుకు ప్రాజెక్టు నీటిని మళ్లించే కాల్వ పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉంది.

☛ గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, వాణిజ్య కార్యక్రమాలు ప్రారంభించాలని కోరుతున్నారు. పోర్టు సమీపంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయడంతో పాటు, అభివృద్ధిని కొనసాగించాలనే ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. అలాగే ఉలవపాడు మామిడి రైతులకు సరైన మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మామిడి రైతులకు మార్కెట్ వసతులు కల్పించడంపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇక కందుకూరు మున్సిపాలిటి అభివృద్ధికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రారంభమయ్యేలా చూడాలని, గతంలోనే ప్రాజెక్టుకు నిధులు కేటాయించినా పనులు మాత్రం ప్రారంభం కానందున వెంటనే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ బైపాస్ రోడ్డు నిర్మాణమయ్యేలా చర్యలు తీసుకోరుతున్నారు.

☛ కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామనే హామీపై నియోజకవర్గ ప్రజల్లో చర్చ నడుస్తుంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రకాశం జిల్లాలో కలుపుతామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


రామాయపట్నం పోర్టు నిర్మాణం

వేతన బకాయిలు విడుదల చేయాలి


టంగుటూరులో ఏపీఓకు వినతి పత్రం అందిస్తున్న మోజెష్, నాయకులు


కొండపిలో ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేత కేజీ మస్తాన్ తదితరులు

టంగుటూరు: వేతన బకాయిలు విడుదల చేయాలని, ఉపాధి హామీ పనులు పునరుద్ధరించాలని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మోజెష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏపీఓ సుభాషిణికి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బొందికి అర్జీలు అందించారు. గత రెండు నెలలుగా కూలీలకు ఇవ్వాల్సిన బకాయిలు వడ్డీతో కలిపి వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు చూపకుంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పనిముట్లు అలాగే పనిముట్లు అందజేయాలని, కనీస వేతనం రూ.600కు పెంచాలన్నారు. సీఐటీయు నాయకులు రాము, మీరాసు, శ్రీనివాసు, సాల్మను, వెంటేశ్వర్లు, యానాది, బుల్లియ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టాలి

కొండపి(టంగుటూరు): ఉపాధి హామీ పెండింగు బిల్లులు చెల్లించాలని, అవినీతిని అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్ కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొండపి ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. కేజీ మస్తాన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు ఎనిమిది వారాలుగా బిల్లులు చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. చేసిన పనికి కూలి ఇవ్వకపోవడం వల్ల కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ 200 రోజులు పని కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య, లక్కిపోగు సుధాకర్, ఎ.సునీత, గడ్డం వందనం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయి కార్మికసంఘు నాయకులు

పామూరు: ఉపాధి పనులు చేసిన కూలీలకు గడిచిన 12 వారాల పెండింగ్ బిల్లులు ఇప్పించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు వైవీ నారాయణ అన్నారు. పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ పనులు కల్పించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ పల్లెల పుట్టారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కొన్ని ప్రాంతాల్లో 40 రోజులుగా కూలీలకు ఉపాధి పనులు లేవని, పాత బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన ఎంపీడీఓ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బి.రామయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కె.శంకర్, షేక్.అల్లాబక్షు ఉన్నారు.

పండుగుల్ల అత్యధిక ధర రూ.173

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో పండుగుల్ల, చూర, ముక్క బేళ్లకు సోమవారం వేలం నిర్వహించగా పండుగల్ల అత్యధిక ధర కేజీ రూ.173 పలికింది. దావగూడూరు, చింతలపాలెం, కాకుటూరివారిపాలెం, తూర్పునాయుడుపాలెం, పాలేటిపాడు గ్రామాల రైతులు పండుగుల్ల బేళ్లు 14 తీసుకురాగా అన్నీ కొనుగోలయ్యాయి. అత్యల్ప ధర కేజీ రూ.101, సరాసరి ధర కేజీ రూ.139.38 పలికింది. అలాగే 609 పొగాకు చూర, ముక్క బేళ్లలో 555 కొనుగోలయ్యాయి. 54 చూర, ముక్క బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర రూ.180, కనిష్ట ధర రూ.60, సరాసరి ధర రూ.93.31 పలికింది. వేలంలో మొత్తం 16 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పండ్లతోటల రైతులకు శిక్షణ

వెలిగండ్ల: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి మంజూరైన రైతులకు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఉద్యావన శాఖాధికారి అంజలి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పండ్లతోటల రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పండ్లతోటల పెంపకానికి పూర్తి సబ్సిడీ అందిస్తుందన్నారు. పండ్లతోటల పెంపకం చేపట్టే రైతులు నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపీడల నివారణ కోసం చేపట్టవలసిన చర్యలు, అధిక దిగుబడి పొందేలా సూచనలు అందించారు. ఎంపీడీఓ రామచంద్రయ్య, ఏపీడీ రాజేష్, ఏపీఓ శ్రీనివాసనాయక్, ఏపీఎంఐపీ ఏరియా ఆఫీసర్ సత్యప్రకాష్, ఈసీ మనోహర్, టీఏలు రాజు, శేషయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

రాయితీపై జొన్న విత్తనాలు

సింగరాయకొండ: పశుపోషకులకు రాయితీపై జొన్న విత్తనాలు అందిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి ఎస్.హజరత్ తెలిపారు. స్థానిక పశువైద్యాలలో సోమవారం రాయితీపై జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. మండలంలో పశుపోషకులకు 75 శాతం సబ్సిడీపై 5 కేజీల చొప్పున జొన్నవిత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి


మాట్లాడుతున్న ఏడీఏ వెంకట రమణ

కనిగిరి రూరల్: కౌలు రైతులంతా గుర్తింపు కార్డులు తీసుకోవాలని ఏడీఏ ఈ వెంకట రమణ అన్నారు. మండలంలోని యడవల్లి, బడుగులేరు రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల అధ్వర్యంలో కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ కౌలు రైతులు భూ యజమానులను ఒప్పించుకొని ఒప్పంద పత్రం ద్వారా కౌలు కార్డులను పొందాలని సూచించారు. కౌలు కార్డు కేవలం 11 నెలలు మాత్రమే పనిచేస్తుందన్నారు. వ్యవసాయాధికారి పి.జోత్స్నాదేవి మాట్లాడుతూ కౌలుకార్డుల ద్వారా పంట నమోదు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కనీస మద్దతు ధరకు ఒప్పుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి


మాట్లాడుతున్న ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్

కనిగిరి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసి చైతన్యవంతులు చేయాలని ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కనిగిరి డివిజన్ పరిధిలోని వైద్యులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి విషజ్వరాలు వచ్చే ప్రమాదం ఉన్నందున తక్షణ తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించి సూచనలు ఇచ్చారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి ఒక్కరికి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన, కమిషనర్ టీవీ రంగారావు, వైద్యులు, వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజారావు

హనుమంతునిపాడు: పండ్ల తోటల సాగుకు ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని డ్వామా ఏపీడీ టి.రామారావు, ఎంపీడీఓ కె.లలిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి క్షేత్ర సహాయకులు, టీఏలు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూయిస్తున్న రైతులను గుర్తించి వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. 5 ఎకరాల లోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. నిమ్మ, దానిమ్మ, మునగ, సపోటా, మామిడి, జామ, డాగన్ ఫ్రూట్స్ సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఓ అంజలి బాయి, ఏఓ క్రిష్టారావు, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎంపీఓ ఎస్.సత్యప్రసాదు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ గౌరీపూజ


గౌరీ పూజల్లో భక్తులు

కనిగిరి రూరల్: పట్టణంలోని దేవాంగనగర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సువాసినులచే సామూహిక ఆషాఢ గౌరీ పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న వారికి కేటీఆర్ విద్యాసంస్థల అధినేత, దేవస్థాన ధర్మకర్త కుందురు తిరుపతిరెడ్డి, శారద దంపతులతో పసుపు, కుంకుమ, జాకెట్ ప్రసాదాలను అందచేశారు. అన్న సమారాధన చేశారు. ఆలయ ఆలయ కమిటీ నాయకులు కొప్పరపు సత్యాలు, శింగరాజు మాలకొండేశ్వరరావు, మార్లె ఉమాకాంత్, తాళ్లూరి రామసుబ్బయ్య, సాధు చలపతిరావు, ఉప్పాల సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులపై అవగాహన

పొన్నలూరు: మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో సోమవారం విద్యుత్ బిల్లుల చెల్లింపులపై వినియోగదారులకు ఆ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైన్ ఇన్స్‌పెక్టర్ మాల్యాద్రి మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల చెల్లింపు కోసం సచివాలయం, మీ సేవ కేంద్రాల దగ్గరకు వెళ్లి సమయం వృథా చేసుకోకుండా డిజిటల్ సేవలు పొందవచ్చన్నారు. తమ సెల్ ఫోన్స్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని బిల్లులు ఇంటి వద్ద నుంచే చెల్లించవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, వినియోదారులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com